విద్యాసంస్థల్లో మాదకద్రవ్య నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో కట్టుదిట్టంగా మాదకద్రవ్యాలను నియంత్రించాలని కలెక్టర్ శ్రీహర్ష అధికారులకు సూచించారు. సమీకృత పాలనా ప్రాంగణంలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాసంస్థల్లో వైద్యశాఖ సహకారంతో మత్తుపదార్థాల నియంత్రణపై అవగాహన కల్పించాలన్నారు. యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాలు చేయాలని సూచించారు. మత్తుపదార్థాలకు అలవాటైన వారిని గుర్తించి పునరావాస కేంద్రాల్లో చికిత్స అందించాలని తెలిపారు. విద్యాసంస్థల్లో నిర్వహించే పేరెంట్స్ కమిటీల్లో గంజాయి, ఇతర మత్తుపదార్థాలపై చర్చించాలని చెప్పారు. గంజాయి సాగు చేసే వారి సమాచారం ఇవ్వాలని కోరారు. తరచూ మందుల దుకాణాలు, ఆసుపత్రుల్లో మందుల నిల్వలను తనిఖీ చేయాలని చెప్పారు. ఏసీపీలు కృష్ణ, రమేష్, జిల్లా అటవీశాఖ అధికారి శివయ్య, విద్యాధికారి మాధవి, ఆబ్కారీ అధికారి మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓపీ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

పెద్దపల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ(అవుట్ పేషెంట్) విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వైద్యులపై కఠిన చర్యలుంటాయని జిల్లా కలెక్టర్ శ్రీహర్ష హెచ్చరించారు. పెద్దపల్లి జిల్లా ప్రధాన ఆస్పత్రి, మాత శిశు సంరక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఓపీ నమోదు కేంద్రాలు, వార్డులను పరిశీలించారు. ఓపీ సమయం ముగియకుండానే 12.40 గంటలకు నలుగురు వైద్యులు అందుబాటులో లేకపోవడంపై ఆస్పత్రి పర్యవేక్షకుడిని కలెక్టర్ ప్రశ్నించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఓపీ విధులు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. డ్యూటీ సమయంలో ప్రైవేటు ఆస్పత్రుల్లో విధులు నిర్వహించే ప్రభుత్వ వైద్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే సదరు ప్రైవేటు ఆస్పత్రులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఓపీ సమయంలో గైర్హాజరైన వైద్యులను కలెక్టరేట్‌కు పంపించాలని పర్యవేక్షకుడికి చెప్పారు. ఆస్పత్రి పర్యవేక్షకుడు శ్రీధర్, ఆర్‌ఎంవో రవిందర్‌లు పాల్గొన్నారు.

ఉన్నత చదువుకు బకాయిల భారం



- పెండింగ్‌లో రూ.120 కోట్ల ఆర్టీఎఫ్ నిధులు
- ప్రైవేటు కళాశాలలు మూసి యాజమాన్యాల నిరసన

పేద పిల్లలు ఉన్నత విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం సమకూరుస్తున్న ఆర్థిక సాయం నిలిచిపోయింది.. విద్యాసంవత్సరం సగం మేర పూర్తయినా బకాయిలు రాకపోవడంతో యాజమాన్యాలు కళాశాలలు మూసి నిరసన తెలుపుతుండగా, ప్రభుత్వ నిర్లక్ష్యం తమ భవిష్యత్తుకు ప్రతిబంధకంగా మారిందని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు..

ఈనాడు, కరీంనగర్

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూడేళ్లుగా ప్రైవేటు డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కళాశాలల ఖాతాలకు చేరాల్సిన ఆర్టీఎఫ్(రీయింబర్స్‌మెంట్ ట్యూషన్ ఫీ) నిధులు పేరుకుపోయాయి. నిర్వహణ భారంగా మారిందని యాజమాన్యాలు కళాశాలలు మూసి నిరసన తెలుపుతుండటంతో దసరా సెలవుల తరువాత విద్యార్థులు ఇళ్ల వద్దే ఉండిపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

- నాలుగు జిల్లాల పరిధిలో 64 డిగ్రీ, 35 పీజీ కళాశాలలతో పాటు 8 ఇంజినీరింగ్, 15 వరకు ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలున్నాయి. అన్ని చోట్లా కలిపి దాదాపు 42 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు.
- డిగ్రీ స్థాయిలో రూ.20 వేలు, ఇంజినీరింగ్ తదితర కోర్సులకు రూ.27 వేల వరకు ప్రభుత్వం ఆర్టీఎఫ్‌ను చెల్లిస్తోంది.
- కొన్ని కోర్సులు మినహాయించి దాదాపు డిగ్రీ విద్యార్థుల ఫీజు మొత్తం రీయింబర్స్‌మెంట్ ద్వారానే యాజమాన్యాలకు అందుతోంది.
- దాదాపు 95 శాతం మంది విద్యార్థులు ప్రభుత్వం చెల్లించే రుసుంతోనే చదువు పూర్తి చేస్తున్నారు.


జమ్మికుంట చాణక్య డిగ్రీ, పీజీ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

మూడేళ్లుగా చెల్లింపులు లేక నాలుగు జిల్లాల్లో కలిపి రూ.120 కోట్ల వరకు బకాయిలున్నాయి.

- 2021-22కు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో 30 శాతం, 2022-23కు సంబంధించి 90 శాతం బకాయిలున్నాయి. గత విద్యా సంవత్సరం(2023-24)లో ఒక్క పైసా విడుదల కాలేదు.
- ప్రస్తుత విద్యా సంవత్సరం విషయంలో అతిగతీ లేకపోగా తెలంగాణ అఫ్లియేటెడ్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్(టీపీడీపీఎంఏ) ఆధ్వర్యంలో పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించారు.
- స్పందన లేకపోవడంతో శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రైవేటు కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఎస్‌యూపీఎంఏ) ఆధ్వర్యంలో బంద్ నోటీసు అందించారు. రెండు రోజులుగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి.

ఉపకార వేతనాలదీ అదే పరిస్థితి

కొన్ని కోర్సులకు సంబంధించి విద్యార్థులు ఆర్టీఎఫ్ పోగా మిగతా ఫీజును చెల్లిస్తామనే ఒప్పందంతో కళాశాలల్లో చేరుతున్నారు. ఉపకార వేతనాలు మంజూరైతే మిగతా ఫీజును చెల్లిద్దామనుకున్నా రెండేళ్లుగా ఎంటీఎఫ్ (మెయింటెనెన్స్ ఫీ టు స్టూడెంట్) సక్రమంగా అందడం లేదు. చదువు పూర్తయినా ప్రభుత్వం నుంచి కళాశాల యాజమాన్యాలకు ఆర్టీఎఫ్ రాకపోవడంతో టీసీ, మార్కుల జాబితా తదితర ధ్రువపత్రాలు తీసుకునే సమయంలో విద్యార్థులు ఫీజు చెల్లించాల్సి వస్తోంది. చాలా కళాశాలల్లో డిగ్రీ విద్యార్థులు ఉపకార వేతనం మొత్తాన్ని కళాశాలకు చెందిన ప్రైవేటు బస్సు రవాణాకు ఉపయోగిస్తున్నారు. అది కూడా రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో కళాశాలలో ఆర్టీఎఫ్ బకాయిలు తృతీయ సంవత్సరం వరకు అలాగే కొనసాగుతున్నాయి.

తరగతులు నష్టపోతున్నాం



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాలేదని కళాశాలలు మూసివేయడంతో మేం నష్టపోవాల్సి వస్తోంది. ఉపకార వేతనాలు వస్తే అవసరమైన విద్యా సామగ్రిని కొనుక్కునే వాళ్లం. నాకు గతేడాదితో పాటు ఈ సంవత్సరానికి చెందిన ఉపకార వేతనం అందలేదు.

-బి.నవ్యశ్రీ, బీకాం ద్వితీయ సంవత్సరం, కరీంనగర్

వేతనాలు చెల్లించలేకపోతున్నాం



కొన్నేళ్లుగా బకాయిలు రాక కళాశాలలు నడపలేని పరిస్థితిలో ఉన్నాం. సిబ్బందికి వేతనాలు సహా నిర్వహణ తలకు మించిన భారంగా మారింది. అప్పు చేసి తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం బకాయిలను సత్వరమే చెల్లించి విద్యా ప్రగతికి తోడ్పాటునందించాలి.

-శ్రీపాద నరేశ్, కార్యదర్శి, ఎస్‌యూపీఎంఏ, జగిత్యాల

వైద్య సేవల పరిమితి పెంపుపై

విశ్రాంత కార్మికుల్లో ఉత్కంఠ

ఆదేశాలు జారీ చేస్తేనే ప్రయోజనం

గోదావరిఖని, న్యూస్‌టుడే

సింగరేణి విశ్రాంత కార్మికులకు రూ.8 లక్షల వరకు వైద్య సేవలు పొందే పరిమితి ఉంది. అయితే దీనిని రూ.10 లక్షలకు పెంచుతామని ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించడంతో పెంపుపై ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ఇందులో భాగంగా జేబీసీసీఐ(బొగ్గుగని కార్మికుల సంయుక్త సంప్రదింపుల కమిటీ)తో ఒప్పందం చేసుకున్నారు.

సవరణకు ఎదురుచూపులు

ఈనెల 7న సింగరేణి కార్మికులకు లాభాల వాటా పంపిణీ సమయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వైద్య సేవల పథక పరిమితిని పెంచుతామని ప్రకటించారు. భార్యభర్తకి కలిపి రూ.8 లక్షల వరకు మాత్రమే పరిమితి ఉండటంతో తలో రూ.4 లక్షల వరకు మాత్రమే వైద్య సేవలకు వెచ్చిస్తూ.. ఈ మొత్తాన్ని జీవితకాలం వినియోగించుకోవాలి. అయితే పెద్దజబ్బు వస్తే ఒకేసారికి పూర్తిగా అయిపోయే అవకాశముంది. ప్రకటించిన రూ.10 లక్షల పెంపుపై యాజమాన్యం అమలుకు ఆదేశాలు జారీచేస్తే విశ్రాంత ఉద్యోగులకు ప్రయోజనం కలగనుంది.

విశ్రాంత అధికారులకు రూ.25 లక్షలు

సింగరేణి అధికారుల వైద్యసేవల పథకం మరింత మెరుగ్గా ఉంది. వారికి రూ.25 లక్షల వరకు వైద్య సేవలు పొందే అవకాశముంది. అయితే వారికి సంబంధించిన పథకం.. ఉద్యోగులకు సంబంధించిన దానిలో తేడాలున్నాయి. కార్మికులు ఉద్యోగ విరమణ పొందే సమయంలో రూ.40 వేలు వైద్య సేవల పథకం కింద చెల్లిస్తే రూ.8 లక్షల పరిమితి వరకు చికిత్స పొందే వీలుంది. అధికారులకు సంబంధించిన పథకంలో ప్రతినెలా వారి జీతభత్యాల్లోంచి 4 శాతం కోసం కోత విధించి నిధికి జమ చేస్తారు.



ప్రతినెలా ఉచితంగా మందులు

సీపీఆర్ఎంఎస్‌లోని విశ్రాంత కార్మికులు ఇన్‌పేషంట్‌గా చేరితే 40 శాతం వైద్య సేవల పథకం నుంచి కోత విధిస్తారు. మిగతా 60 శాతం యాజమాన్యం భరిస్తుంది. ప్రతినెలా అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తారు. అలాగే ప్రాణాంతక వ్యాధులకు సంబంధించిన వైద్యానికి అయ్యే ఖర్చులు అపరిమితం. క్యాన్సర్, హృదయ సంబంధిత, మూత్రపిండాలు, ఎయిడ్స్, రహదారి ప్రమాదం, పక్షవాతం, నరాలకు సంబంధించిన వైద్యం అపరిమితంగా పొందే అవకాశం ఉంటుంది.

36 వేలమందికి ఉపయోగం..

ఎక్కువమంది విశ్రాంత కార్మికులు ఉండటంతోపాటు వైద్య సేవల నిధికి తక్కువ మొత్తంలో జమ చేస్తుండటంతో పరిమితి తక్కువగా విధించారు. ప్రస్తుతం సింగరేణిలో 36 వేల మంది విశ్రాంత కార్మికులు సీపీఆర్ఎంఎస్(విశ్రాంత ఉద్యోగుల వైద్య సేవల పథకం)లో సభ్యులుగా ఉన్నారు. వీరికి సంస్థ ఆస్పత్రుల్లో సాధారణ చికిత్సలు ఉచితంగా అందిస్తారు.

అదనపు బస్సులు నడిపినా..



మంథని బస్టాండ్ మంగళవారం ప్రయాణికులతో రద్దీగా కనిపించింది. దసరా అనంతరం పట్టణం నుంచి కరీంనగర్, హైదరాబాద్ రూట్లలో వెళ్లేందుకు అధిక సంఖ్యలో ప్రయాణికులు బస్సుల కోసం వేచి చూశారు. హైదరాబాద్‌కు ఆదివారం నుంచి సోమవారం వరకు అదనపు బస్సులను నడిపిన ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మంథని డిపో మేనేజర్ శ్రావణ్‌కుమార్ బస్టాండ్‌లో ఉండి రద్దీకి అనుగుణంగా ఆయా రూట్లలో అదనంగా బస్సులను ఏర్పాటు చేశారు. ఆది, సోమవారం కలిపి రెండు రోజుల్లో మంథని డిపోకు రూ.24 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. మంగళవారం కరీంనగర్, హైదరాబాద్ రూట్లలో ఎనిమిది అదనపు బస్సులను ఏర్పాటు చేశామని డీఎం చెప్పారు.

- న్యూస్‌టుడే, మంథని

నేడు విధుల్లోకి కొత్త ఉపాధ్యాయులు


అభ్యర్థికి నియామక పత్రం అందిస్తున్న కలెక్టర్

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం నుంచి ఉపాధ్యాయుల కొరత తీరనుంది. ఇటీవల డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలు అందించిన అధికారులు మంగళవారం వారికి కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలకు కేటాయించారు. ఉదయం జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు రాగా.. విద్యాశాఖ కౌన్సెలింగ్ వాయిదా వేసినట్లు ప్రకటించింది. అనంతరం రెండు గంటల తర్వాత కౌన్సెలింగ్‌కు రావాలని వారికి సందేశాన్ని పంపించడంతో సాయంత్రం వరకు అభ్యర్థులు హాజరయ్యారు.

73 మందికి పోస్టింగ్


జిల్లాలో 93 ఖాళీలు ఉండగా. . 73 మందికి పోస్టింగ్ ఇచ్చారు. పలు కారణాలతో మిగిలిన 20 పోస్టులు భర్తీ కాలేదు. సమీకృత పాలనా ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం కౌన్సెలింగ్ నిర్వహించి.. మెరిట్ ఆధారంగా పాఠశాలలను కేటాయించారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) జీవశాస్త్రం 6, ఎస్ఏ తెలుగు 3, హిందీ 5, ఉర్దూ 1, పీడీ 2, సాంఘికశాస్త్రం 15, ఆంగ్లం 3, భౌతికశాస్త్రం 2, గణితం 7, సాంఘికశాస్త్రం(ఉర్దూ మాధ్యమం) 1, పీఈటీ 1, భాషా పండితులు(తెలుగు) 3, ఉర్దూ 2, ఎస్జీటీ(తెలుగు) 13, ఉర్దూ 3, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ 6 చొప్పున భర్తీ అయ్యాయి. వీరంతా బుధవారం ఆయా పాఠశాలల్లో చేరాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ప్రస్తుతం 2200 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. పోస్టింగ్ కేటాయించిన ఉపాధ్యాయులు విధిగా పాఠశాలల్లో చేరాలని జిల్లా విద్యాధికారి మాధవి సూచించారు.

చెరువుల్లోకి చేప పిల్లలు

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

ఎట్టకేలకు గుత్తేదార్లు ముందుకు రావడంతో ఉచిత చేప పిల్లల పంపిణీపై అడ్డంకులు తొలిగాయి. ఈ ఏడాది చేప పిల్లల పంపిణీ ప్రక్రియ.. ఎన్నికల కోడ్.. గుత్తేదారు టెండర్ ప్రక్రియ తదితర కారణాలతో జిల్లాలో ఆలస్యమైంది. దీంతో మత్స్యకారులు ఆందోళన చెందారు. ఇటీవల జిల్లాలోని చెరువులు, జలాశయాల్లో చేప పిల్లలను వదులుతుండటంతో వారిలో ఆనందం నెలకొంది. అయితే ఇప్పటికీ చేప పిల్లల పెంపకంలో అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. తక్కువ పరిమాణం పిల్లలు పంపిణీ చేయడంతో వాటిల్లో ఎదుగుదల లేదు. గతంతో పోల్చితే ఈసారి లక్ష్యం కూడా తగ్గింది. గత సమస్యలు పరిష్కరిస్తేనే మత్స్యకారులకు గిట్టుబాటు అవుతోంది.

ఈ ఏడాది సగానికి తగ్గిన లక్ష్యం



మత్స్యకారుల్లో ఆందోళన

జిల్లాలో చెరువులు, కుంటలతో పాటు సుందిళ్ల బ్యారేజీ, శ్రీపాద ఎల్లంపల్లి జలాశయాల్లో చేపలు, రొయ్యలను పెంచుతున్నారు. ఈ ఏడాది అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి జలాశయాలు, 1,073 చెరువులు, కుంటల్లో 79.31 లక్షల చేప పిల్లలను వదలాలని ప్రభుత్వం నిర్ణయించింది. 1,058 చెరువులు, కుంటల్లో 51.01 లక్షలు, 12 పెద్దచెరువులు, 3 జలాశయాల్లో 28.31 లక్షల చేప పిల్లలు వదలనున్నారు. ఈ ఏడాది చేప పిల్లల పంపిణీ లక్ష్యం సగానికి తగ్గింది. ఇది మత్స్యకారులకు ఆందోళన కలిగించే విషయం.


సుల్తానాబాద్ చెరువులో చేపలు వదులుతున్న అధికారులు, సభ్యులు

ఇవీ సమస్యలు

- ప్రతి సీజన్‌లో చేప పిల్లల పరిమాణం, మోతాదు విషయంలో కచ్చితమైన ప్రామాణికత పాటించడం లేదు.
- నిబంధనల ప్రకారం పెద్ద సైజు(80 నుంచి 100 ఎంఎం) పిల్లలు, చిన్న సైజు (35-40ఎంఎం) పిల్లలను చెరువుల్లో వదలాలి.
- చిన్న సైజ్ పిల్లలు మృతి చెందుతున్నాయి. పెద్ద పరిమాణంవి చేతికందడం లేదు.
- కల్తీ విత్తన పిల్లలు పంపిణీ చేయడంతో రవ్వ, బొచ్చ రకాల ఉత్పత్తి పెరగకపోవడంతో నష్టం వస్తుంది.
- 2 కిలోలు ఉండాల్సిన చిన్న పరిమాణం పిల్లలు పోషకాహార లోపంతో అరకిలోకే పరిమితమవుతున్నాయి.

ఇలా చేస్తే ఉపాధి

- చేప పిల్లల పంపిణీ మొదలవడంతో అధికారులు నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి.
- కల్తీ విత్తనాలు రాకుండా మేలైనా రకాలు పంపిణీ చేసేలా పర్యవేక్షించాలి.
- నీరు సమృద్ధిగా ఉన్న చెరువుల్లోనే చేప పిల్లలు వదిలేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- మత్స్యకార సహకార సంఘాల్లో వర్గ పోరుతో ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిని నియంత్రించాలి.


జన్మించిన పిల్లలతో వారి బంధువులు

ఒకే రోజు 20 ప్రసవాలు


గోదావరిఖని పట్టణం: స్థానిక ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో సోమవారం 20 ప్రసవాలు జరిగాయి. ఇందులో 5 సాధారణ ప్రసవాలు కాగా మిగతావి శస్త్రచికిత్స చేశారు. వరుసగా సద్దుల బతుకమ్మ, దసరా కావడంతో ఆయా గర్భిణీలు పండుగ తర్వాత రావడంతోనే ఒకేరోజు 20 ప్రసవాలు జరిగినట్లుగా ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి.

సాదాబైనామా దరఖాస్తులకేదీ మోక్షం!

సాగులో ఉన్నా హక్కులు లేక రైతుల దైన్యం

న్యూస్‌టుడే, గోదావరిఖని

భూ యాజమాన్య హక్కుల కోసం చిన్న సన్నకారు రైతులు ఎదురుచూస్తున్నారు. తెల్లకాగితాలు, స్టాంపు పేపర్లతో ఒప్పందం చేసుకుని కొనుగోలు చేసిన భూములకు గత ప్రభుత్వం హక్కులు కల్పిస్తామన్న ప్రకటన నెరవేరలేదు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు.. ఆర్థిక ప్రయోజనాలకు భూ యాజమాన్య హక్కులు తప్పనిసరిగా మారాయి. దీంతో రైతుల ఇబ్బందులను గుర్తించిన గత ప్రభుత్వం మూడున్నరేళ్ల క్రితం సాదా బైనామా లన్నింటినికి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని ప్రకటించగా.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1.12 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. నేటికీ మోక్షం లభించడంలేదు.



తరతరాలుగా సాగు

చాలామంది రైతులు సాగు చేసుకుంటున్న కొన్ని భూములకు వారి పేరుపై ఎలాంటి పత్రాలు లేవు. పూర్వకాలంలో తెల్లకాగితాలు, స్టాంపు పేపర్లపై ఒప్పందం చేసుకుని కొనుగోలు చేసిన భూములు సాగుచేసుకుంటూ వస్తున్నారు. అధికారికంగా రికార్డుల్లో పాత వారి పేరుతోనే ఉంటుంది. దీంతో రికార్డుల్లో ఉన్నవారికి సంబంధించిన వారసులు, కుటుంబ సభ్యుల నుంచి కొన్ని గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొన్నిచోట్ల వారసులు వచ్చి అది తమ భూమి అంటూ సాగులో ఉన్నవారిని బెదిరింపులకు పాల్పడిన సందర్భాలున్నాయి. కొన్ని సంఘటనలు ఠాణాల వరకూ వెళ్లాయి.

తమకే హక్కు ఉందంటూ ఒత్తిడి

గతంలో సాదాబైనామాతో కొనుగోలు చేసిన భూముల్లో కొన్నింటికి ప్రస్తుతం విలువ పెరిగింది. వ్యవసాయ భూములు కొనుగోలు చేసిన రైతులకు.. కొన్ని ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనుకూలంగా మారాయి. దీంతో రికార్డుల్లో ఉన్నవారితో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారికంగా తమకే హక్కు ఉందంటూ ఒత్తిడి చేస్తున్నారు. లేదంటే ప్రస్తుతం ఉన్న విలువ ప్రకారం డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. కొన్నేళ్లుగా సాగు చేసుకుంటూ జీవిస్తున్న చిన్న, సన్నకారు రైతులు ఊహించని పరిణామాలతో ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో దరఖాస్తులు	
కరీంనగర్:	26,871
పెద్దపల్లి:	35,580
జగిత్యాల:	35,010
సిరిసిల్ల:	15,056

సర్కారుకు ఆదాయం

ఎంతోకాలంగా పరిష్కారం కాని సాదాబైనామా భూములకు ప్రభుత్వం హక్కు కల్పించేందుకు తీసుకున్న నిర్ణయంతో యూజర్ ఛార్జీల కింద రైతులు భారీగానే చెల్లించారు. దీంతో భారీ మొత్తంలోనే ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది. మీసేవా కేంద్రాల ద్వారా ఈ ప్రక్రియను చేపట్టగా. . ఆయా నిర్వాహకులకు దస్తావేజుల విక్రయాల పేరుతో ఆదాయం లభించింది.

సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదని అధికారులు చెబుతున్నారు. కొత్తగా 2024 ఆర్ఓఆర్ చట్టం ద్వారా కొన్ని మార్పులు చేస్తున్నారు. అందులో ఏమైనా దీనికి సంబంధించిన అంశం చేర్చితే పరిష్కారానికి అవకాశం ఉండనుంది.

పీఏసీఎస్‌ను సందర్శించిన లఖ్‌నవూ నాబార్డు బృందం


పీఏసీఎస్‌లో శుద్ధజల నీళ్లసీసాల తయారీని పరిశీలిస్తున్న బృంద సభ్యులు

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: సుల్తానాబాద్ పీఏసీఎస్‌ను మంగళవారం లఖ్‌నవూ నాబార్డు బృందం సందర్శించింది. సంఘం వ్యాపారాలు, పనితీరు, ఆర్థిక ప్రగతి, కంప్యూటరీకరణ, లావాదేవీలు, రుణాల పంపిణీ, రికవరీ, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. సంఘం ఆధ్వర్యంలో తయారు చేస్తున్న శుద్ధజల నీళ్ల సీసాల తయారీ, శుద్ధజల కేంద్రాలను.. సూపర్‌మార్కెట్, సీఎస్సీ కేంద్రం తదితర వ్యాపారాలను పరిశీలించారు. బృందం సభ్యులు డీడీఎం జయప్రకాశ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ బ్రహ్మానందరావు, రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ, సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, సీఈవో సంతోష్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లపై కలెక్టర్ సమీక్ష

పెద్దపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో 2024-25 సీజన్‌లో పత్తి కొనుగోళ్లపై కలెక్టర్ శ్రీహర్ష మార్కెటింగ్ అధికారులతో మంగళవారం సమీక్షించారు. జిల్లాలో 51,000 ఎకరాల్లో పత్తి సాగు అయినట్లు చెప్పారు. వ్యవసాయశాఖ అంచనాల ప్రకారం 4,70,000 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశముందన్నారు. కొనుగోళ్లకు జిల్లాలోని మూడు వ్యవసాయ మార్కెట్లు, నాలుగు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డితో పాటు వివిధ మార్కెట్ల అధికారులు పాల్గొన్నారు.

కల్తీ కబళిస్తోంది

నేడు ప్రపంచ ఆహార దినోత్సవం

ఆహార పదార్థాలు పండిన చోటు నుంచి లేదా తయారైన చోటు నుంచి వినియోగదారులకు చేరే క్రమంలో కొందరు స్వార్థపరుల వల్ల కల్తీకి గురవుతున్నాయి. పదార్థాలు ఆకర్షణీయంగా ఉండాలనో.. ఎక్కువకాలం నిలువుండాలనో.. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందాలనో ఇలా రకరకాల ప్రయోజనాలను ఆశించి అవసరం లేని రసాయనాలు వాడి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు. అందుకే శరీరంలో ఏదో తెలియని నిస్సత్తువ. శుభ్రమైన నీరు.. నాణ్యమైన ఆహార పదార్థాలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఆహార భద్రతపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

– న్యూస్‌టుడే, కరీంనగర్ పట్టణం, కరీంనగర్ సాంస్కృతికం

వయసుల వారీగా వినియోగం (కేలరీల్లో)

2-3 ఏళ్ల మధ్య వారు	1000-1400
18 వయసులోపు వారు	2,400
19-20 మధ్య..	2,600
21-40 సంవత్సరాల వయసు వారికి	2400
41-60 మధ్య వయసు వారు	2200
61 ఏళ్ల పైబడిన వారు	2000


సిరిసిల్ల: శుభకార్యంలో మిగిలిన ఆహార పదార్థాలను పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ విద్యారాణి

ఉదయం లేచినప్పటి నుంచి పడుకునే వరకు ప్రతి ఒక్కరు ఎన్నో సేవలు పొందుతున్నారు. ప్రతి సందర్భంలోనూ వినియోగదారులమే. మనకు కావాల్సిన వస్తువులు అమ్మేది, సేవలు అందించేది ప్రైవేటు వ్యక్తులు.. సంస్థలు.. ప్రభుత్వమైనా కావచ్చు. చెల్లించిన సొమ్ముకు తగిన ప్రతిఫలం ఆశించడం వినియోగదారుల హక్కు. డబ్బిచ్చి అనారోగ్యం పాలవడం ఎంతవరకు సమంజసం. ఆహారపదార్థాలపై హక్కు, బాధ్యతలను గుర్తించి చైతన్యం ప్రతి ఒక్కరిలో ఉండాలని పౌరసమాజం కోరుకుంటోంది.

డబ్బులిచ్చి జబ్బు పడాలా?

ఎలా చేస్తారంటే..

పాలు, పాల ఉత్పత్తులు: తరచూగా కల్తీకి గురయ్యేది నిత్యం వాడే పాలు. అందులో ఏ నీళ్లు పడితే ఆ నీళ్లు కలిపితే అనారోగ్యం తప్పదు. పాల రంగు, చిక్కదనం కోసం చాక్ పౌడర్, యూరియా, కాస్టిక్ సోడా, హైడ్రోజన్ పెరాక్సైడ్ లాంటివి కలపడం వల్ల జీర్ణ సంబంధ సమస్యలు, పిల్లల్లో హార్మోన్ల సమస్యలు వస్తాయి.



పప్పులు: ఆకర్షణీయంగా కన్పించేందుకు మెటానిల్ ఎల్లో కలర్ కలుపుతారు. ఇది కలిపిన ఆహారపదార్థాలు తింటే న్యూరోటాక్సిసిటీ అనే సమస్య తలెత్తి నాడీ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంది.



మసాల దినుసులు: మిరియాల్లో బొప్పాయి గింజలు, పసుపులో మెటానిల్ ఎల్లో, రెడ్ ఆక్సైడ్, ఇంగువలో మట్టి, కారంలో ఇటుక పొడి కలుపుతారు. ఇలాచీ, కుంకుమ పువ్వులో మొక్కజొన్న పీచును కలుపుతారు.



కూరగాయలు, పండ్లు: కాపు ఎక్కువగా వచ్చేందుకు, పురుగు పట్టకుండా ఉండేందుకు ఎన్నో రసాయన మందులు వినియోగిస్తున్నారు. ఆకర్షణీయంగా కనిపించేందుకు రసాయన రంగులు ఇంజెక్ట్ చేస్తారు. ఆకుపచ్చని కూరలు మరింత పచ్చగా తాజాగా కనిపించేందుకు లెడ్ క్రోమైట్ కలిసిన ద్రావణం వాడుతారు. ఇంకా మలచైట్ గ్రీన్ అనే రసాయనం పచ్చగా మారుతాయి. ఇంకా ఆక్సిటోసిన్, కాల్షియం కార్బైడ్, వ్యాక్స్, కాపర్ సల్ఫేట్ వంటివి వాడుతున్నారు.



ఇదీ నేపథ్యం..

1945లో ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ స్థాపనకు గుర్తింపుగా ఏటా అక్టోబరు 16న ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 'మంచి భవిష్యత్తు కోసం ఆహారం అందించడమే లక్ష్యం' అనే థీమ్‌ను ఈ ఏడాది తీసుకున్నారు.

వృథా వద్దు..

✦ జనాభాకు అనుగుణంగా అవసరమైన ధాన్యంతోపాటు ఇతరత్రా ఆహార పదార్థాల సరఫరా లేదు. శుభకార్యాల సందర్భంగా మిగిలిన ఆహారం వృథాగా పారేస్తున్నారు. అదే పదార్థాలను అనాథలకు, పేదలకు అందజేసే సంకల్పంతో కొందరు స్వచ్ఛందంగా సేవలందిస్తున్నారు. వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమం 9949 914242కు ఫోన్ చేస్తే వారే వ్యాన్ లేదా ఆటోలో వచ్చి ఆహారం తీసుకెళ్తారు.

✦ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ దంపతులు ఆరేళ్లుగా శుభకార్యాల్లో మిగిలిన ఆహారాన్ని స్లమ్ ఏరియాలోని కుటుంబాలకు అందిస్తున్నారు. 93945 05101కు ఫోన్ చేస్తే వారే ఆటోలో తీసుకెళ్లి పేదలకు అందిస్తున్నారు.

రంగులు కలిపితే సమస్యలు తప్పవు

– సాయి ప్రియ, న్యూట్రిషియనిస్ట్, కరీంనగర్



ఆహార పదార్థాల్లో రసాయన రంగులు కలపడం వల్ల క్యాన్సర్, రక్తహీనత సమస్యలు తలెత్తుతాయి. జంక్ ఫుడ్, మంచూరియా, చిల్లీ పౌడర్, ఆయిల్స్, రెడీ ఈట్ ఫుడ్‌లో ఇవి ఎక్కువగా కలిసే అవకాశం. ఫాస్ట్ ఫుడ్‌లో ఏయే పదార్థాలు కలిపారో చూసుకొని తినాలి. ఎక్కువగా కొబ్బరి, ఇతరాత్ర చెట్ల పాలు తాగడం మంచిది. సహజంగా దొరికే ఆకు కూరలు, కూరగాయలు తీసుకోవాలి.

కనిపెట్టడం ఇలా..

● చిన్న సీసాలో కొద్దిగా పాలు తీసుకుని గిలకొట్టాలి. డిటర్జెంట్ లాంటివి కలిపితే నురగ ఎక్కువగా వస్తుంది.

● తెల్లని బ్లాటింగ్ పేపర్‌ని తడిపి కాని తడి దూదితో కానీ కూరగాయలు, పండ్లు తుడిస్తే కృత్రిమ రంగు ఉంటే తెలిసిపోతుంది.

● ఐస్ క్రీం కొంచెం విడిగా తీసి దాని మీద రెండు చుక్కల నిమ్మరసం పిండాలి. నురగలు వస్తే కల్తీ జరిగినట్లే.

● మిరియాలను ఆల్కహాల్‌లో వేస్తే మునిగిపోతాయి. బొప్పాయి గింజలు కలిస్తే తేలుతాయి.

● పంచదార, ఉప్పుల్లో కల్తీ జరిగినట్లు అనుమానిస్తే వెంటనే తీసుకుని నీళ్లలో వేస్తే అవి కరిగిపోతాయి. కల్తీ ఉంటే చాక్ పౌడర్ అడుగున పేరుకుంటుంది.

● కాస్త తేనెలో దూదిని ముంచి తీసి వెలిగిస్తే మండుతుంది. కల్తీ అయితే చిటపటలాడుతుంది.

● కరిగిన నెయ్యిలో ఒక స్పూన్ చక్కెర వేసి బాగా కలపాలి. ఐదు నిముషాల తర్వాత అడుగు ఎరుపు రంగులోకి మారితే కల్తీ జరిగినట్లు.

● పసుపు కానీ పప్పు కానీ.. కొద్దిగా నీళ్లలో వేసి దాంట్లో కొన్ని చుక్కల హైడ్రోక్లోరిక్ ఆసిడ్ వేయాలి. మెటానిల్ ఎల్లో కల్తీ జరిగితే నీరు ఊదారంగులోకి మారుతుంది.


జమ్మికుంట మార్కెట్‌లో పత్తి బిడ్డింగ్

స్వల్పంగా తగ్గిన పత్తి ధర

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం పత్తి ధర స్వల్పంగా తగ్గింది. యార్డుకు 30 ట్రాలీల కొత్త విడి పత్తిని రైతులు విక్రయానికి తీసుకురాగా బిడ్డింగ్‌లో కనిష్ఠ ధర రూ. 6200, గరిష్ఠ ధర రూ. 6900 పలికింది. 10 క్వింటాళ్ల బస్తాల పత్తిని విక్రయానికి తేగా రూ. 6,100 నుంచి రూ. 6,500 వరకు పలికింది. మొత్తంగా ధర సోమవారం కంటే రూ. 60 మేర తగ్గింది. బిడ్డింగ్‌ను మార్కెట్ కార్యదర్శి రాజా పరిశీలించారు. తేమ శాతం అధికంగా ఉండం వల్లే ధర తగ్గిందని అధికారులు చెబుతున్నారు.

జగిత్యాల బీటుకు అధికంగా మక్కలు

జగిత్యాల వాణిజ్యం, న్యూస్‌టుడే: జగిత్యాల వ్యవసాయ మార్కెట్ యార్డుకు రైతులు మంగళవారం 724 క్వింటాళ్ల మక్కలను విక్రయానికి తెచ్చారు. బీటులో మక్కలకు క్వింటాకు కనిష్ఠంగా రూ. 1,805 నుంచి గరిష్ఠంగా రూ. 1,950 వరకు ధర పలికిందని మార్కెట్ కార్యదర్శి టి. రాజశేఖర్ తెలిపారు. ఎంటీయూ- 1010 దొడ్డురకం ధాన్యానికి సగటున రూ. 1,870 చొప్పున ధర లభించినట్లు పేర్కొన్నారు.

అగ్నిమాపక శాఖ సిబ్బందికి నైపుణ్య శిక్షణ


సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే : కరీంనగర్ మానేరు జలాశయంలో రెండు రోజులపాటు నిర్వహించే అగ్నిమాపక శాఖ జోనల్ స్థాయి నైపుణ్య శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. మొదటి రోజు కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, కామారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల నుంచి హాజరైన 70 మంది సిబ్బందికి శిక్షణ అందించారు. కొత్తగా కొనుగోలు చేసిన రిమోట్ కంట్రోల్ లైఫ్ సేవింగ్ బోట్‌పై శిక్షణ, అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బుధవారం కరీంనగర్, నిర్మల్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, ములుగు, ఆసిఫాబాద్ జిల్లాల 60 మంది సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మంచిర్యాల జిల్లా అధికారి భగవాన్‌రెడ్డి పర్యవేక్షించారు.

అండర్-23 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు 18న

కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: అండర్-23 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో పాల్గొనే కరీంనగర్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఈనెల 18న కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ మైదానం ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి ఎన్. మురళీధర్ రావు ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారుల్లో 60 మందిని ఎంపిక చేసి, 15 మంది చొప్పున నాలుగు జట్లుగా విభజించి మ్యాచ్‌లు నిర్వహిస్తామన్నారు. ఇందులో నుంచి తుది జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఈ జట్టు నవంబర్ నెల హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెదక్, వరంగల్ జిల్లాల్లో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటుందన్నారు. క్రీడాకారులు సొంత కిట్టు, యూనిఫాం, 10వ తరగతి మెమో, జనన ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలతో ఈనెల 17న సాయంత్రం 5 గంటల వరకు కేడీసీఏ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. క్రీడాకారులు 2001 సెప్టెంబరు 1 తర్వాత జన్మించి ఉండాలన్నారు. ఎంపిక మ్యాచ్‌లకు కేడీసీఏ ఉపాధ్యక్షులు కె. మహేందర్‌గౌడ్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని, ఉపాధ్యక్షుడు పి. మనోహర్‌రావు సభ్యుడు అజిత్‌కుమార్‌లు మ్యాచ్‌లను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

క్రికెట్‌లో మెరుపులు

● బ్యాట్ పడితే సిక్స్.. బంతి విసిరితే బోల్డ్
● రాణిస్తున్న ఉమ్మడి జిల్లా అండర్-19 క్రీడాకారులు

న్యూస్‌టుడే
కరీంనగర్ క్రీడా విభాగం

బ్యాట్ పట్టి క్రీజ్‌లోకి వెళ్తే వచ్చిన బంతి సిక్స్ వెళ్లాల్సిందే.. ప్రత్యర్థి ఎవరైనా బంతి విసిరితే క్లీన్ బౌల్డ్ కావడం తథ్యం.. వెరసి ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు కప్పు కొట్టడం ఖాయం.. ఉమ్మడి జిల్లా క్రికెట్ క్రీడాకారులు తమదైన ప్రతిభతో ముందుకు సాగుతూ క్రికెట్ అభిమానుల అభినందనలు అందుకుంటున్నారు. ఇటీవల హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలో జరిగిన అంతర్ జిల్లాల అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచి ట్రోఫీని అందుకున్నారు. ప్రతిభ చాటుతున్న ఉమ్మడి జిల్లా క్రీడాకారులతో 'న్యూస్‌టుడే' కథనం.



11 ఏళ్లుగా ఆడుతూ..

కరీంనగర్‌కు చెందిన ధర్మపురి ఆంజనేయులు, సంధ్యారాణిల కుమారుడు సాత్విక్ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 11 ఏళ్లుగా క్రికెట్ సాధన చేస్తున్నాడు. తల్లి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, తండ్రి పోలీసు శాఖలో ఉద్యోగం చూస్తూ కుమారుడికి క్రికెట్‌పై ఉన్న ఆసక్తిని గుర్తించి కోచింగ్ ఇప్పిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో సాత్విక్ సుమారు 150 మ్యాచ్‌ల్లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లు, సిరీస్‌లు అందుకున్నాడు. ఇటీవల జరిగిన అండర్-19 రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. భారత జట్టు జెర్సీని వేసుకుని ఆడినప్పుడే తనకు అసలైన ఆనందం ఉంటుందని సాత్విక్ చెబుతున్నాడు.

మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌తో ప్రశంసలు..



మెట్టుపల్లికి చెందిన నగేష్ భీమ్నాథ్-పద్మావతిల కుమారుడు విఘ్నేష్‌కు చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఇష్టం. నాలుగేళ్ల నుంచి మెట్‌పల్లి నుంచి కరీంనగర్‌కు వచ్చి క్రికెట్ సాధన చేస్తున్నాడు. ఇటీవల వరంగల్‌లో జరిగిన అండర్-19 టోర్నమెంట్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లు, మ్యాన్ ఆఫ్ ది సిరిస్‌గా నిలిచి అతిథుల ప్రశంసలు అందుకున్నాడు. పాఠశాల, కళాశాల స్థాయిలో ఇప్పటి వరకు సుమారు 70 మ్యాచ్‌లు ఆడి ప్రతిభ చాటాడు. భారత జట్టుకు ఎంపికయ్యే వరకు నిత్యం సాధన చేస్తూనే ఉంటానని, మెట్‌పల్లి నుంచి కరీంనగర్‌కు వచ్చి సాధన చేయడం కష్టంగా ఉన్నా.. ఇష్టంగా చేస్తున్నానని విగ్నేష్ చెప్పాడు

బృంద నాయకుడిగా ముందుండి నడిపిస్తూ..



జగిత్యాల జిల్లా కొడిమ్యాలకు చెందిన ఎర్రోజు మోహనాచారి, స్వప్నల కుమారుడు తక్షిల్ కొడిమ్యాలకు చెందిన సీనియర్లను చూసి ఏడేళ్లుగా సాధన చేస్తున్నాడు. తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో తనకు ఆటలపై ఆసక్తి ఉండటంతో క్రికెట్‌పై శిక్షణ ఇప్పిస్తున్నాడు. వరంగల్‌లో జరిగిన అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో కరీంనగర్ జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి ప్రతి మ్యాచ్‌లో సత్తా చాటి జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు. 2022లో ఎస్‌జీఎఫ్ అండర్-17 క్రికెట్ జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 2020లో హైదరాబాద్ అండర్-14 జట్టుకు ఎంపికయ్యాడు. ఇప్పటి వరకు సుమారు 100 మ్యాచ్‌లు ఆడాడు. భారత జట్టుకు కెప్టెన్ కావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తక్షిల్ తెలిపాడు.

ఏకలవ్యుడిగా సాధన...



కరీంనగర్‌కు చెందిన పల్లె పరశురాములు, సునీతల కుమారుడు ఆదిత్య క్రికెట్‌ను ఆరాదిస్తాడు. భారత జట్టుకు ఎప్పుడు, ఎలాంటి మ్యాచ్ ఉన్నా టీవీ ముందు నుంచి కదలడు. చిన్నప్పటి నుంచి క్రికెట్‌పై ఇష్టంతో నాలుగేళ్ల నుంచి సాధన చేస్తున్నాడు. క్రికెట్‌లో భవిష్యత్తు ఉండదని ఎంత మంది చెప్పినా లెక్క చేయకుండా స్వయంగా సాధన చేస్తున్నాడు. సుమారు 23 జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ చాటి మంచి గుర్తింపు సాధించాడు. క్రికెట్ ఆటపై ప్రావీణ్యం పెంచుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని కోచ్‌గా ఎదిగి ఉన్నతమైన క్రికెటర్‌లను తయారు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాడు.

పాతకక్షలతో యువకుడి హత్య


సాగర్

కోరుట్ల, న్యూస్‌టుడే: పాతకక్షలతో యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన కోరుట్ల పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. . అయిలాపూర్ ప్రాంతంలో నివసిస్తున్న బోయిని సాగర్ (కల్యాణ్) (32)కి కోరుట్ల పట్టణంలోని కొంత మందితో స్నేహం ఉండేది. గతంలో మద్యం తాగుతున్న క్రమంలో గొడవ జరగగా కక్ష పెంచుకున్నారు. ఆదివారం రాత్రి ప్రకాశం రోడ్‌లో సాగర్ మద్యం తాగుతుండగా.. కొందరు అక్కడి చేరుకొని గొడవకు దిగారు. స్థానికులు 100 నంబర్‌కు సమాచారం అందించగా పోలీసులు చేరుకొని అందరిని అక్కడి నుంచి పంపించేశారు. రాత్రి 11.30 ప్రాంతంలో మరోమారు గొడవకు దిగి సాగర్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో ఓ యువకుడు సాగర్ మెడపై దాడి చేసిన అనంతరం నిందితులందరూ పరారయ్యారు. సాగర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సీఐ సురేశ్‌బాబు, కోరుట్ల, కథలాపూర్ ఎస్సైలు శ్రీకాంత్, నవీన్‌కుమార్‌లు మృతదేహాన్ని పరిశీలించి హత్యకు గల కారణాలు తెలుసుకున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు.

20న జూనియర్ ఖోఖో జట్టు ఎంపిక పోటీలు

కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: ఈనెల 20న కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జూనియర్ ఖోఖో జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి వై. మహేందర్‌రావు తెలిపారు. క్రీడాకారులు 2006 నవంబరు 22 తరువాత పుట్టిన వారై ఉండాలన్నారు. 10వ తరగతి మెమో, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఉదయం 9.00 గంటలలోపు అంబేడ్కర్ స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

జగిత్యాల డీఎస్పీకి అతి ఉత్కృష్ట పతకం

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల డీఎస్పీ దురిశెట్టి రఘుచందర్‌కు కేంద్ర ప్రభుత్వం అతి ఉత్కృష్ట పతకం ప్రకటించింది. మావోయిస్టు కార్యకలాపాలను ధైర్యంగా ఎదుర్కొన్నందుకు, పోలీసు శాఖలో విశేషమైన సేవలందించినందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన ఈ పతకానికి ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆయనను జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

తండ్రిని చంపిన తనయుడికి జీవితఖైదు

జగిత్యాల, న్యూస్‌టుడే: తండ్రిని చంపిన తనయుడికి జగిత్యాల న్యాయస్థానం మంగళవారం జీవితఖైదు విధించింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. గొల్లపల్లి మండలం రాపల్లికి చెందిన గడుగు పోచయ్య, శాంతలకు నలుగురు కుమారులు. పోచయ్య కుమారులు చేసిన అప్పులు తీర్చడానికి కొంత భూమి విక్రయించేందుకు ఇతరులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇది నచ్చని చిన్న కుమారుడు ప్రభుదాస్.. తల్లిదండ్రులతో గొడవకు దిగాడు. 2008 నవంబర్ 23న తన తల్లి శాంతపైకి రాళ్లు విసరగా గాయపడ్డారు. విషయం తెలిసిన పోచయ్య ఇంటికి రాగా ప్రభుదాస్ కర్రతో దాడి జరిపి తీవ్రంగా గాయపర్చాడు. అతడిని ఆసుపత్రికి తరలించగా మృతి చెందారు. గొల్లపల్లి పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు పంపించారు. అప్పటి ఇన్‌స్పెక్టర్లు జి. మహేశ్‌బాబు, ఎం. రవీందర్‌రెడ్డి దర్యాప్తు చేసిన ఈ కేసులో కోర్టు విధుల అధికారులు జి. రాజునాయక్, ఎం. కిరణ్‌కుమార్, శ్రీధర్‌లు న్యాయస్థానానికి సాక్ష్యాధారాలు సమర్పించారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ మల్లికార్జున్ వాదించగా నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు, రూ. 5 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. నీలిమ తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడడానికి చొరవ చూపిన అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

విదేశీ కొలువు.. ఇలా సులువు

● టామ్‌కామ్ ఆధ్వర్యంలో నియామకాలు
● రేపు కరీంనగర్‌లో జాబ్ మేళా

ఈనాడు, సిరిసిల్ల

ఉమ్మడి జిల్లాలో స్థానిక ఏజెంట్ల చేతిలో మోసపోయి గల్ఫ్ దేశాల్లో చాలా జీవితాలు వెల్లదీస్తున్నారు. అక్కడ సరైనా పని.. తిండి లేక నరకం అనుభవిస్తున్నారు. విదేశాల్లో ఉండలేక.. స్వదేశాలకు రాలేక అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనుకునే యువతకు తెలంగాణ విదేశీ మానవ వనరుల సంస్థ(టామ్‌కామ్) సువర్ణావకాశాలు కల్పిస్తోంది. జిల్లాల వారీగా ఉద్యోగ మేళాలను నిర్వహిస్తోంది. యూఏఈలో డెలివరీ బాయ్స్ నియామకాల కోసం ఈ నెల 17న కరీంనగర్‌లోని మున్సిపల్ కార్యాలయం పక్కనున్న ఓ హోటల్‌లో మేళా నిర్వహిస్తోంది. దీనికి 21 నుంచి 40 ఏళ్ల వయస్సు వారు అర్హులు.

వీరు పదో తరగతి మెమోతో పాటు పాస్‌పోర్టు, మూడేళ్ల క్రితం తీసిన డ్రైవింగ్ లైసెన్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో మేళాకు హాజరు కావాలి. నియామక ప్రక్రియ దాదాపు నెల రోజుల్లో పూర్తి చేసి. కేవలం మెడికల్ పరీక్షలకు డబ్బులు తీసుకొని విదేశాలకు పంపిస్తారు. ఉమ్మడి జిల్లావాసులు ఈ మేళాకు హాజరు కావచ్చు.

20 దేశాలకు విస్తరణ

టామ్‌కామ్ సంస్థ 2020 వరకు గల్ఫ్ దేశాలకు మాత్రమే నియామకాలు జరిపేది. తర్వాత జపాన్, యూరోపియన్, మిడిల్‌ఈస్ట్, కెనడా, ఆస్ట్రేలియా తదితర 20 దేశాలకు విస్తరించింది. నర్సింగ్, హోటల్, నిర్మాణ, డ్రైవింగ్ తదితర 15 రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. ఆయా దేశాల ప్రభుత్వాలతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం ప్రకారం నియామకాలు చేపడుతోంది. జర్మనీలో నర్సింగ్ కోసం ఈ నెల 14న కామారెడ్డి, జగిత్యాల జిల్లాలో అభ్యర్థులకు ముఖాముఖి నిర్వహించింది. 300 మంది హాజరుకాగా అందులో మహిళలు, పురుషులు కలిపి 153 మంది ఎంపికయ్యారు.

● సిరిసిల్లకు చెందిన ఇమ్రాన్‌కు ఏజెంటు సూపర్ మార్కెట్‌లో పని ఉందని రూ. 1.20 లక్షలు తీసుకుని మూడు నెలల క్రితం కంపెనీ వీసా పేరుతో దుబాయ్ పంపించాడు. తీరా అక్కడికి వెళ్లాక వేరే పనులు చెప్పడంతో ఇమ్రాన్ ఇబ్బందులు పడ్డాడు. స్వదేశానికి పంపాలని యాజమాన్యాన్ని కోరితే చిత్రహింసలకు గురిచేశారు. సామాజిక మాధ్యమాల్లో గోడు వెళ్లబోసుకోవడంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అక్కడి ఎంబసీ అధికారులతో మాట్లాడి ఇమ్రాన్‌ను ఇక్కడికి రప్పించారు.


● జగిత్యాల జిల్లా సారంగపూర్‌కు చెందిన అజయ్ 14 నెలల క్రితం స్థానిక ఏజెంటుకు రూ. 2.70 లక్షలు చెల్లించి ఇరాక్ వెళ్లాడు. అక్కడి ఏజెంటు పాస్‌పోర్టు తీసుకొని పని కల్పించలేదు. చేతిలో చిల్లి గవ్వ లేక పస్తులుంటున్నానంటూ తల్లిదండ్రులకు అజయ్ బాధపడుతూ వీడియో పంపించాడు. దీంతో వారు స్థానిక ఏజెంట్‌ను నిలదీయగా రూ. 1 లక్ష తిరిగి ఇచ్చారు. పాస్‌పోర్టు లేక, వచ్చేందుకు డబ్బుల్లేక అజయ్ అక్కడే అవస్థలు పడుతున్నాడు.

భాషపై శిక్షణ

విదేశాలకు వెళ్లేవారికి హిందీ, ఆంగ్లంపైనే కాకుండా అక్కడి భాషపై అవగాహన ఉండాలి. ఇందుకు టామ్‌కామ్ ఆధ్వర్యంలో మన ప్రభుత్వమే ఆయా భాషలపై అభ్యర్థులకు ఉచిత శిక్షణిస్తుంది. ఒప్పందం చేసుకొని దేశాల భాషా శిక్షణకు అభ్యర్థులే ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.

మెరుగైన వేతనాలు

విదేశాల్లో ఉద్యోగాలకు మెరుగైన వేతనాలు లభిస్తాయి. న్యాక్ సంస్థలో శిక్షణ పూర్తిచేసుకున్న వారికి జర్మనీలో నిర్మాణ రంగంలో ఉపాధి అవకాశాలున్నాయి. రాష్ట్రం నుంచి అక్టోబరు మొదటి వారంలో 32 మంది జర్మనీకి వెళ్లారు. వీరికి ఏడాది ట్రైనీలుగా నెలకు రూ. 1లక్ష వరకు వేతనం ఉంటుంది. పని బాగుంటే అదే కంపెనీలో అవకాశం ఇస్తారు. అప్పుడు నెలకు 2.80 లక్షల జీతం అందిస్తారు.



టామ్‌కామ్ యాప్

యాప్‌లో ఉద్యోగాల సమాచారం

టామ్‌కామ్ వెబ్‌సైట్‌తోపాటు యాప్‌లోనూ అన్ని వివరాలు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు, నిరుద్యోగులు విద్యార్హతలు, అనుభవం తదితర వివరాలు నమోదు చేసుకోవాలి. దీంతో ఏఏ దేశాల్లో ఎలాంటి ఉద్యోగావకాశాలు ఉన్నాయనే సమాచారం అందులో ఉంటుంది. వెబ్‌సైట్, యాప్‌లోని సమాచారంతో జిల్లాల వారీగా జరిగే జాబ్‌మేళాలకు హాజరు కావచ్చని రాష్ట్ర టామ్‌కామ్ మేనేజర్ షబ్బనం 'ఈనాడు'కు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 4 PM)
గోదావరిఖని : 80085 73573
పెద్దపల్లి : 80085 73542
మంథని : 99122 68471

న్యూస్‌టుడే, ముత్తారం

? ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ క్రాస్ నుంచి గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపుల పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ప్రమాదకరంగా మారాయి. **- శ్రీకాంత్, గ్రామస్థుడు**

✔ పిచ్చిమొక్కలను కూలీలతో తొలగిస్తాం. **- పంచాయతీ కార్యదర్శి, మల్లీశ్వరీ**

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

? గోదావరిఖని టీచర్స్ కాలనీలోని పార్కు సమీపంలో వీధి దీపం లేకపోవడంతో అంధకారం నెలకొంది. వెంటనే విద్యుత్తు దీపాన్ని ఏర్పాటుచేయాలి. **- రఘురామచారి, టీచర్స్ కాలనీ**

✔ రెండు రోజుల్లో కొత్త వీధి దీపాలు రానున్నాయి. రాగానే అక్కడ వీధి దీపాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.
- రాంజీ, రామగుండం నగరపాలక ఏఈ

న్యూస్‌టుడే, పాలకుర్తి

? బసంత్‌నగర్ టోల్‌ప్లాజా వద్ద రెండు ప్రవేశ ద్వారాల గుండా వాహనాలను అనుమతించడంతో ట్రాఫిక్ రద్దీగా ఉంటుంది. **- వాహనదారులు**

✔ స్థల సమస్య కోర్టు విచారణలో ఉన్నందున ఆలస్యమవుతుంది. పరిష్కరిస్తాం. **- టోల్‌ప్లాజా యాజమాన్యం, బసంత్‌నగర్**


పొత్కపల్లిలో ఠాణాలో సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ చేతన

శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి

ఓదెల, న్యూస్‌టుడే: పొత్కపల్లి పోలీసుస్టేషన్‌ను పెద్దపల్లి డీసీపీ చేతన మంగళవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లోని కార్డులను, రిసెప్షన్, పరిసరాలను పరిశీలించి.. సిబ్బందితో మాట్లాడి విధులకు సంబంధించి సూచనలు చేశారు. బాధితుల ఫిర్యాదులపై వెంటనే పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రత పరిరక్షణలో పోలీస్‌లు అప్రమత్తంగా ఉండాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఏసీపీ కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఖనిలో 'అలయ్ బలయ్'

గోదావరిఖని: సామాజిక ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వేదిక కన్వీనర్ వెంకటరమణ తెలిపారు. స్థానిక కల్యాణ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్, నగర మేయర్ అనిల్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. మతాలకతీతంగా హాజరు కావాలని కోరారు.

పదోన్నతులు చేపట్టాలి

రామగుండం, న్యూస్‌టుడే: నాలుగేళ్లుగా పెండింగులో ఉన్న పదోన్నతులు చేపట్టాలని రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం రామగుండం బి-థర్మల్ ఎస్ఈ విజేందర్‌కు వినతిపత్రం అందించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, ప్రాంతీయ అధ్యక్షులు అబ్దుల్ నజ్మి, కార్యదర్శి కరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బి-థర్మల్ ఎస్ఈ విజేందర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

'సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలి'

ధర్మారం, న్యూస్‌టుడే: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పనిచేయాలని డీపీవో వీరబుచ్చయ్య సూచించారు. రెండ్రోజుల క్రితం మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆయన మంగళవారం తొలిసారిగా మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల సిబ్బందితో మండల పరిషత్‌లో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో రమేష్, మండల వైద్యాధికారి సుష్మిత, ఎస్సీ సంక్షేమాధికారి సంపత్, ఏపీవో తులసీమాత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

ఎలిగేడు(సుల్తానాబాద్), న్యూస్‌టుడే: ఎలిగేడు మండలంలోని గ్రామాల్లో మంగళవారం నుంచి నెలరోజులపాటు పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు మండల పశు వైద్యురాలు ఝాన్సీ తెలిపారు. మంగళవారం ర్యాకల్ దేవ్‌పల్లిలో 122 పశువులకు టీకాలు వేశారు.


ర్యాకల్‌దేవ్‌పల్లిలో టీకాలు వేస్తున్న పశువైద్యులు

వైభవంగా దుర్గామాత శోభాయాత్ర

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాలు కమాన్‌పూర్ మండల కేంద్రంలో అంగరంగవైభవంగా ముగిశాయి. సుభాష్‌నగర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో వీధుల గుండా మంగళవారం ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో అమ్మవారికి స్వాగతం పలికారు. ఒగ్గు కళాకారుల విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళ కోలాటాలు, యువతీ యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


ఒగ్గు కళాకారుల విన్యాసం

చికిత్స పొందుతూ మహిళ మృతి

గోదావరిఖని: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మంగళవారం రాత్రి మృతిచెందింది. గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన పిట్టల శారద(43) సోమవారం రాత్రి నడుచుకుంటూ వస్తుండగా.. స్థానిక గాంధీచౌక్ వద్ద వేగంగా వచ్చిన స్కూటీ ఢీకొంది. దీంతో ఆమె తలకు బలమైన గాయం కాగా.. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్లు ఖని ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు.

రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి మోక్షమెప్పుడో?



మండలంలోని కన్నాల రైల్వే గేటు కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే గేటు వద్ద రాకపోకలు సాగించేందుకు అధికారులు ప్రత్యామ్నాయ దిశగా ఆలోచించడం లేదని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దిల్లీ నుంచి చెన్నైకు వెళ్లే ప్రధాన రైల్వే మార్గం కావడంతో తరచూగా గేటు మూసివేయడంతో రైలు వెళ్లే వరకు నిరీక్షించాల్సి వస్తుంది. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని పలుమార్లు రైల్వే అధికారులకు విన్నవించినా స్పందన కరవైంది. **-న్యూస్‌టుడే, పాలకుర్తి**

నగరపాలిక నిర్లక్ష్యానికి నిదర్శనం

బతుకమ్మ పూల వ్యర్థాలను తొలగించాల్సిన పారిశుద్ధ్య కార్మికులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విఠల్‌నగర్ పోస్టాఫీస్ వద్ద బతుకమ్మ పూలు అలాగే ఉండటంతో దోమల బెడద తీవ్రమవుతుంది. మున్సిపల్ అధికారులు వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, రాంమందిర్ ఏరియా



శిథిలావస్థలో నీటి ట్యాంకు



బసంత్‌నగర్ గ్రామ పంచాయతీ సమీపంలోని నీటి ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో ప్రమాదకరంగా మారింది. ట్యాంకుపై చుట్టూ కొంతభాగం లికేజీ సమస్య ఉత్పన్నమవుతుంది. ఈ సమస్యతో నీటి ట్యాంకు కూలిపోయే ప్రమాదముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, పాలకుర్తి

దశలవారీగా అభివృద్ధి పనులు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి పుర పరిధిలోని 26, 27, 28, 29, 31 వార్డుల్లో రూ.1.27 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే విజయరమణారావు మంగళవారం భూమిపూజ నిర్వహించారు. రూ.75లక్షలతో సుభాష్‌నగర్‌లో బీటీ రోడ్డు, మురుగు కాలువల నిర్మాణం, రూ.52 లక్షలతో జెండా కూడలి నుంచి చాకలి ఐలమ్మ విగ్రహం వరకు బీటీ రోడ్డు పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణంలో దశల వారిగా రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.

సుల్తానాబాద్: మత్స్యకారుల జీవనప్రమాణాలు పెంపొందేలా చెరువు, కుంటలను పరిరక్షిస్తామని ఎమ్మెల్యే విజయరమణారావు పేర్కొన్నారు. సుల్తానాబాద్ గ్రామచెరువులో మంగళవారం రాయితీ చేపపిల్లలను వదిలిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో హైడ్రా తరహా పథకాన్ని ప్రవేశపెట్టి చెరువు, కుంటల ఆక్రమణలను తొలగిస్తామన్నారు. పుర ఛైర్‌పర్సన్ లక్ష్మి, డీఎఫ్ఓ భాస్కరాచారి, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో దివ్య దర్శన్‌రావు, మత్స్య సహకార సంఘాల జిల్లా అధ్యక్షుడు నర్సయ్య, సుల్తానాబాద్ సంఘ అధ్యక్ష, కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.


పెద్దపల్లి : బీటీ రోడ్డు, మురుగు కాలువ నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే విజయరమణారావు

బదిలీ అయిన విద్యుత్తు అధికారులకు సన్మానం

ధర్మారం, న్యూస్‌టుడే: ధర్మారం సబ్‌డివిజన్ పరిధిలో బదిలీ అయినా విద్యుత్తు అధికారులను మంగళవారం స్థానిక కార్యాలయంలో సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఏడీఈ కనకయ్య, ఖిలావనపర్తి సెక్షన్ ఏఈ సురేష్, సబ్‌ఇంజినీర్ శ్రీనివాస్, సెక్షన్ లైన్ ఇన్స్‌పెక్టర్ సదానందం, లైన్‌మెన్లు కుమారస్వామి, మధు పెద్దపల్లికి బదిలీ అయ్యారు. సబ్‌డివిజన్ కార్యాలయ సబ్ ఇంజినీర్ బైరం సతీష్ బొంపెల్లికి, ధర్మారం సెక్షన్ సబ్‌ఇంజినీర్ అనిల్ ఎలిగేడుకు, లైన్‌మెన్ ప్రవీణ్‌కుమార్ జూలపల్లికి, సీనియర్ లైన్‌ఇన్స్‌పెక్టర్ కొమురయ్య బొంపల్లికి వెళ్లారు. ఈ సందర్భంగా మంగళవారం వీరందరినీ ధర్మారం సబ్‌డివిజన్ కార్యాలయంలో ట్రాన్స్‌కో సిబ్బంది ఘనంగా సన్మానించారు. ధర్మారం ఏడీఈగా విజయ్‌గోపాల్‌సింగ్, ఖిలావనపర్తి సెక్షన్ ఏఈగా మహిపాల్‌రెడ్డి, సబ్‌డివిజన్ కార్యాలయ సబ్‌ఇంజినీరుగా దిలీప్, ఖిలావనపర్తి సెక్షన్ లైన్ ఇన్స్‌పెక్టరుగా ఆనందరావు, నందిమేడారం లైన్‌మెన్‌గా కొప్పుల శ్రీనివాస్ బదిలీపై వస్తున్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్తు ఉపకేంద్రం ఏఈ అశోక్ కమాన్‌పూర్‌కి, సబ్ ఇంజినీర్ సునీల్ కాట్నపల్లికి, లైన్ ఇన్స్‌పెక్టర్ సూర్యనారాయణ ఎలిగేడుకు, లైన్‌మెన్ రాజేశం, అంజయ్యలు బొంపల్లి, కాల్వశ్రీరాంపూర్‌లకు బదిలీ అయ్యారు. వీరిని మంగళవారం ఉప కేంద్రం సిబ్బంది లైన్‌మెన్ సంపత్ సన్మానించారు.


ధర్మారంలో సబ్ డివిజన్ కార్యాలయంలో..


జూలపల్లిలో..

రైతులతో మంత్రి సమీక్ష

కమాన్‌పూర్ (సెంటినరీ కాలనీ), న్యూస్‌టుడే: రామగిరి మండలం రత్నాపూర్ రైతువేదికలో మంగళవారం టీ-ఫైబర్ సమ్మిట్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించారు. రైతు వేదికలో ఉన్న అధికారులు, రైతులతో మాట్లాడారు. టీ-ఫైబర్ సేవల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంథని ఏడీఏ అంజని, కేవీకే శాస్త్రవేత్తలు, ఏఈవోలు పాల్గొన్నారు.


దృశ్య మాధ్యమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

విద్యార్థినికి అభినందన

పెద్దపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని షేక్‌పేటలో ఈ నెల 5, 6 తేదీల్లో జరిగిన అండర్-14 జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో పెద్దపల్లిలోని ట్రినిటీ పాఠశాల విద్యార్థిని భవాని కాంస్య పతకం సాధించింది. మంగళవారం భవానిని మున్సిపల్ ఛైర్‌పర్సన్ మమతరెడ్డి అభినందించారు.


విద్యార్థితో మమతరెడ్డి, ప్రిన్సిపల్


అమ్మవారి వద్ద పూజలు చేస్తున్న పుట్ట మధూకర్

దుర్గామాత వద్ద జడ్పీ మాజీ ఛైర్మన్ పూజలు

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: కమాన్‌పూర్ పరిధిలోని సుభాష్‌నగర్‌లో శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద మంగళవారం జడ్పీ మాజీ ఛైర్మన్ పుట్ట మధూకర్ పూజలు చేశారు. భారాస నాయకులు శ్రీనివాస్, అనిల్‌గౌడ్, లక్ష్మీమల్లు, రామ్మూర్తి, దుర్గామాత కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


పెద్దపల్లిలో దినపత్రికల ఏజెంట్ల ఆధ్వర్యంలో..


పెద్దపల్లిలోని గాయత్రి పాఠశాలలో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పిల్లలు


మార్కండేయ కాలనీ: కలాం విగ్రహానికి నివాళి అర్పిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు

ఘనంగా కలాం జయంతి

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌లో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యాసంస్థల ఛైర్మన్ శ్రీనివాస్, కరస్పాండెంట్ రజిని తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయకాలనీ: గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని శ్రీరామవిద్యానికేతన్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం అబ్దుల్‌కలాం జయంతి వేడుకల సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నమస్కరించారు. మరోవైపు తెలంగాణ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు శంకర్ ఆధ్వర్యంలో కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రతి విద్యార్థి ఆయన ఆశయ సాధనలో నడవాలన్నారు.

నేటి నుంచి జోనల్ స్థాయి పోటీలు

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: సింగరేణి పరిరక్షణలో ప్రధాన భూమిక పోషిస్తున్న రెస్క్యూ సభ్యులకు నేటి నుంచి రెండు రోజులపాటు ప్రతిభ పరీక్షల నిర్వహణకు సింగరేణి యాజమాన్యం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆర్జీ-2 డివిజన్‌లోని మైన్స్ రెస్క్యూ స్టేషన్‌లో బుధవారం సంస్థ సంచాలకులు వెంకటేశ్వర్‌రెడ్డి, మరో అధికారి ఉమేష్ సావర్కర్ ఈ పోటీలను ప్రారంభించనున్నారు. 17న రెస్క్యూ స్టేషన్ ఆవరణలో నిర్వహించే ముగింపు కార్యక్రమానికి సంస్థ సీఎండీ బలరాం, భారత బొగ్గు గనుల భద్రత విభాగం ముఖ్య అధికారి భూషన్ ప్రసాద్‌సింగ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. సింగరేణి వ్యాప్తంగా 11 డివిజన్ల నుంచి 6 జట్లు పాల్గొనగా.. ఈ పోటీలను వీక్షించడానికి కార్మికులు వారి కుటుంబసభ్యులు రావాలని జీఎం శ్రీనివాస్ కోరారు.



సమస్యలు పరిష్కరిస్తాం

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: ఓసీపీ-3 ప్రాజెక్టులోని భారీ యంత్రాలతో ఉత్పన్నమవుతున్న సమస్యలు, ఆపరేటర్లు పడుతున్న ఇబ్బందులపై సీఐటీయూ నాయకులు ఇచ్చిన విన్నపం మేరకు.. మంగళవారం మేనేజర్ భరత్‌కుమార్ భారీ యంత్రాలను పరిశీలించారు. సమస్యలను ఆపరేటర్లను అడిగి తెలుసుకున్నారు. జీఎం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సంస్మరణ సభకు తరలిరండి

యైటింక్లయిన్‌కాలనీ: 2003 అక్టోబరు-17న జరిగిన గని ప్రమాదంలో 10 మంది కార్మికులు మృతిచెందగా.. వీరిని స్మరిస్తూ ఏటా సంస్మరణ సభ నిర్వహిస్తున్న సందర్భంగా జీడీకే-8ఏ గని మాజీ కార్మికులు, సంఘాల నాయకులు హాజరుకావాలని మృతుల కుటుంబసభ్యులు కోరారు. గురువారం వారి 21వ వర్ధంతిని నిర్వహించనున్నట్లు తెలిపారు.

వాహన టెండర్లలో అన్యాయం

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: ఆర్జీ-3 ఏరియాలో వాహన టెండర్లలో భూనిర్వాసితులమైన తమకు అన్యాయం జరిగిందని నాగేపల్లికి చెందిన పొన్నం బాలకృష్ణ, మేడగొని నరేందర్ వాపోయారు. సెంటినరీకాలనీలో మంగళవారం వారు మాట్లాడుతూ.. భూనిర్వాసితులకు సింగరేణి అద్దె వాహనాలు ఏర్పాటుకు అవకాశం కల్పించిందన్నారు. ఈ ప్రక్రియను టెండర్ల పద్ధతిలో నిర్వహించగా.. కొందరు సింగరేణి అధికారులు చేతివాటం చూపుతూ తమకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ విషయంపై సింగరేణి సీఎండీ, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

గనులపై భోజనాలు

గోదావరిఖని: సింగరేణి బొగ్గు గనులపై మంగళవారం భోజనాలు కొనసాగాయి. కార్మికుల్లో స్నేహభావం పెంపొందించేందుకు వనభోజనాల మాదిరిగా బడాఖానా ఏర్పాటుచేశారు. ఈమేరకు ఓసీపీ-5పై నిర్వహించగా. . మేయర్ అనిల్‌కుమార్, జీఎం లలిత్‌కుమార్‌లు పాల్గొని భోజనాలు వడ్డించారు. సీఎస్పీ-1లోనూ బడాఖానా నిర్వహించారు.

సంస్థ స్థితిగతులపై అవగాహన

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి జీడీకే-1 గనిని మల్టీ డిపార్టుమెంటు కమిటీ మంగళవారం సందర్శించింది. అనంతరం నిర్వహించిన సమావేశంలో సంస్థ స్థితిగతులపై అవగాహన కల్పించారు. అనంతరం ఛైర్మన్ బలరాం పంపిన సందేశాత్మక వీడియోను ప్రదర్శించారు. గని ఏజెంటు, రక్షణ అధికారి, మేనేజర్లు, ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

డిసెంబర్ నాటికి మౌలిక వసతులు కల్పించాలి

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని రెండు పడకల ఇళ్లలో డిసెంబర్ చివరి నాటికి మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. సమీకృత పాలనా ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దపల్లిలోని చందపల్లి, రాంపెల్లిలో విద్యుత్తు, తాగునీరు, మురుగు కాలువల నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. రామగుండంలో 580 గృహాలు నిర్మించారని, మిగిలిన 90 ఇళ్ల పనులు పూర్తి చేయాలన్నారు. ఓదెల, కాల్వశ్రీరాంపూర్‌లోని ఇళ్ల పనులకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. అదనపు పాలనాధికారి అరుణశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

పెద్దపల్లి: జిల్లా గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన సంస్థ సహకారంతో స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వాణిజ్య సముదాయంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఎమ్మెల్యే విజయరమణారావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

పాఠశాలకు సామగ్రి అందజేత

పాలకుర్తి: అలుమినీ-2024 మెగా ఆత్మీయ సమ్మేళనాన్ని పురస్కరించుకొని పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలకు 30 కుర్చీలు, శబ్ద పరికరాన్ని పూర్వ విద్యార్థులు మంగళవారం అందజేశారు. రామస్వామి, తిరుమల, లక్ష్మినర్సయ్య, ఫసియొద్దీన్, రమేష్, శ్రీనివాస్, రవి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఫ్రిజ్ వితరణ

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయానికి శ్రీరంగనాథరాజు, శ్రీనాథరాజు, సాయినాథరాజు సోదరులు మంగళవారం తాగునీటి సౌకర్యార్థం ఫ్రిజ్ వితరణ చేశారు. ఆలయ నిర్మాణ దాత మనోహర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మహేష్, కమిటీ సభ్యులు ఐలయ్య, అనిల్, శంకరయ్య, వజ్రారెడ్డి, రమేష్, వెంకటరమణ, మహేష్ పాల్గొన్నారు.

ఆలయానికి విద్యుత్తు సామగ్రి...

ఓదెల: మండల కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయానికి గ్రామానికి చెందిన తుమ్మ మధుకర్ విద్యుత్తు సామగ్రి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా గౌడ సామాజిక వర్గీయులు మధుకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చరవాణి అందజేత

జూలపల్లి: మండలంలోని ఎలిగేడు గ్రామానికి చెందిన కప్పంపల్లి శంకరయ్యకు మంగళవారం ఇన్‌ఛార్జి ఎస్సై వేణుగోపాల్ చరవాణి అందజేశారు. శంకరయ్య చరవాణి పోవడంతో జూలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితుడికి అప్పగించారు.

పది రూపాయల నాణేలపై అవగాహన

ధర్మారం: పది రూపాయల నాణేలు చెలామణిలో ఉన్నాయని ధర్మారం యూనియన్ బ్యాంకు చీఫ్ మేనేజర్ శివ పేర్కొన్నారు. మంగళవారం ధర్మారంలోని పలువురు చిరువ్యాపారులు, దుకాణదారులకు రూ.10 నాణేలు అందించారు. నాణేలను నిరాకరించవద్దని వారికి సూచించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కాల్వశ్రీరాంపూర్: గంగారం గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొక్కిస రవీందర్‌గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులను మంగళవారం సీపీఐ నాయకులు పరామర్శించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ముత్యంరావు, నాయకులు రాజేందర్, రవీందర్, లక్ష్మణ్, రాజయ్య పాల్గొన్నారు.

ముత్తారం: హరిపురం గ్రామానికి చెందిన భారాస నాయకుడు అడ్డూరి లింగయ్య తల్లి రాజమ్మ అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మంగళవారం పరామర్శించారు. మచ్చుపేటకు చెందిన కోట సతీష్ ఇటీవల పురుగు మందు తాగి మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. మాజీ ఎంపీపీ ముత్తయ్య, ముత్తారం భారాస మండలాధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి పాల్గొన్నారు.

ఎస్సైగా బాధ్యతల స్వీకరణ

రామగుండం: రామగుండం ఎస్సైగా సంధ్యారాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు భూపాలపల్లిలో విధులు నిర్వహించిన ఆమె.. బదిలీపై రామగుండం వచ్చారు.


సంధ్యారాణి

విఠల్‌నగర్‌లో శునకాల వీరంగం

గోదావరిఖని పట్టణం: స్థానిక విఠల్‌నగర్‌లో మంగళవారం శునకాలు పలువురిపై దాడిచేశాయి. విఠల్‌నగర్‌కు చెందిన లక్ష్మీభారతితోపాటు తేజశ్రీ, సుశాంత్ అనే చిన్నారులను సైతం తీవ్రంగా గాయపరిచాయి. వీరిని ఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

ఇందిరమ్మ కమిటీ రద్దు చేయాలని వినతి

ముత్తారం: ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన తీర్థాల కొమురయ్య ఇందిరమ్మ కమిటీని రద్దు చేయాలని మంథని ఆర్డీఓ హనుమానాయక్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కమిటీని గ్రామ కార్యదర్శి, కారోబార్ నిబంధనలు పాటించకుండా ఏర్పాటు చేశారని.. తక్షణమే కమిటీని రద్దుచేసి.. నూతన కమిటీని నియమించాలని వినతిపత్రం ద్వారా కోరారు.

ఓడేడులో గ్రామ సభ

ముత్తారం: ఓడేడు గ్రామపంచాయతీ ఆవరణలో వచ్చే సంవత్సరం చేపట్టాల్సిన పనులకు సంబంధించి గ్రామసభను ఎంపీడీవో ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. వచ్చే సంవత్సరం ఈజీఎస్ పనుల కింద గ్రామాల్లో చేపట్టవలసిన పనులను గుర్తించడం, ప్రణాళికలు సిద్ధం చేయడం లాంటి అంశాలపై తగు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి సంధ్య, ఈజీఎస్ సిబ్బంది, ఆశాలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ల బదిలీ

జగిత్యాల: రాష్ట్రంలో మంగళవారం పలువురు సబ్ రిజిస్ట్రార్ల బదిలీ జరిగింది. ఇందులో ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరున్నారు. మెట్‌పల్లి సబ్ రిజిస్ట్రారు ఎం.డి. ఆసిఫొద్దీన్‌ను షేర్‌లింగంపల్లికి.. రామగుండం సబ్ రిజిస్ట్రారు ఎం.బాలకిషన్‌ను గండిపేటకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యుదాఘాతంతో గొర్రె మృతి

ముత్తారం: మండలంలోని కాకర్లపల్లి గ్రామానికి చెందిన మీరాల సతీష్‌కు చెందిన గొర్రె విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందింది. గొర్రె విలువ సుమారు రూ.20,000 ఉంటుందని నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు వేడుకున్నాడు.